క్లుప్తంగా

20 నుంచి సీతారాముల వార్షిక కల్యాణోత్సవాలు



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై ఉన్న ప్రాచీన రామాలయంలో ఈనెల 20 నుంచి 26 వరకు వార్షిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. 20న అంకురార్పణ పూజలు, 21 స్వామివారి వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం పెందుర్తి మండలం పాపయ్యరాజుపాలేనికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు లక్ష 116 రూపాయలు నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించారు. బాండ్‌ను అన్నప్రసాద విభాగం ఏఈవో పి.నరసింగరావు అందజేశారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న డీఎల్‌సీ అధ్యక్షురాలు అంజూ సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ దీపిక లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్టు దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా చెప్పారు. పరవాడ భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు డీఎల్‌సీ సమకూర్చిన మూడు వీల్‌చైర్స్, 10 వినికిడి యంత్రాలు, స్మార్ట్ కేన్ వంటి ఉపకరణాలను ఆమె శనివారం అందజేశారు. కార్యక్రమంలో సీఎస్సార్ సీనియర్ మేనేజర్ కె.ప్రకాశరావు, మమత పటేల్, ఉపాధ్యాయులు కుమారి, శ్రీనివాస్, పలువురు యాజమాన్య ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధ్యాన సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



జ్ఞాన మందిరం భూమి పూజలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

పెందుర్తి: సంపూర్ణ ఆరోగ్యం కోసం నిరంతర ధ్యాన సాధన అవసరమని అహం బ్రహ్మాస్మి మహేశ్వర జ్ఞాన మందిరం వ్యవస్థాపకుడు అలుగోలు శంకర్రావు అన్నారు. పెందుర్తి మండలం జుత్తాడలో నూతనంగా నిర్మించనున్న అహం బ్రహ్మాస్మి మహేశ్వర జ్ఞాన మందిరం నిర్మాణం కోసం శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు రాజు గౌడ, డి.కె. రెడ్డి, సౌజన్య, చరణ్ సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

అక్కిరెడ్డిపాలెం: అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ విశాఖపట్నం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని షీలానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచార సభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రచార సభ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా శీలంశెట్టి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నంబారు రాజు, కార్యదర్శిగా మద్దిల గురునాయుడు, సహాయ కార్యదర్శిగా కొట్టనాల రమేష్, కోశాధికారిగా అల్లు నరహరి, డిస్ట్రిక్ట్ కమాండెంట్‌గా గంటి బంగారు నాయుడు ఎన్నికయ్యారు.

అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగు



సమావేశమైన డ్వాక్రా మహిళలు (ఫైల్)

- వైఎస్సార్ 'ఆసరా'తో ఆర్థికంగా బలపడిన మహిళలు
- నాలుగు విడతల్లో రూ. 149.04 కోట్ల లబ్ధి
- నియోజకవర్గంలో 4827 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు పథకం వర్తింపు

మండలం	గ్రూపులు	సభ్యులు	నగదు
పెందుర్తి	672	6891మంది	రూ.4.71 కోట్లు
సబ్బవరం	1764	18,922 మంది	రూ.54.10 కోట్లు
పరవాడ	1143	12641 మంది	రూ.51.69 కోట్లు
93వ వార్డు	161	1610 మంది	రూ.4.64 కోట్లు
94వ వార్డు	264	2640 మంది	రూ.7.23 కోట్లు
95వ వారు	190	1900 మంది	రూ.6.11 కోట్లు
96వ వార్డు	392	3920 మంది	రూ.12.63 కోట్లు
97వ వార్డు	194	1940 మంది	రూ.6.64 కోట్లు
98వ వార్డు	47	470 మంది	రూ.1.32 కోట్లు

పెందుర్తి: రాష్ట్రంలోని మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలిచింది. సంక్షేమ పథకాలు వారికే అందిస్తూ అన్ని విధాలా ప్రోత్సహించింది. దీనిలో భాగంగా స్వయం సహాయక సంఘాల ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ చేశారు. తొలి మూడు విడతలు విజయవంతంగా అమలు చేసిన ప్రభుత్వం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేసి మహిళల మోములో ఆనందం నింపింది. మొత్తం నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నియోజకవర్గంలోని 4,827 స్వయం సహాయక సంఘాల్లో ఉన్న 50,934 మంది సభ్యులకు రూ.149.04 కోట్లు లబ్ధి చేకూరింది.

ప్రతి ఇంట్లో పండగే

ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో పాటు డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు తీసుకున్న రుణాలను ప్రభుత్వం తిరిగి వారి ఖాతాల్లో జమ చేసింది. దీంతో తమకు ఆర్థిక భరోసా లభించిందని మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. 2019 ఏప్రిల్ వరకు ఉన్న రుణాలను పూర్తిగా మాఫీ చేసి ఆయా నగదును నేరుగా లబ్ధిదారులైన అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతల్లో జమ చేశారు. ఆ మొత్తాలను సద్వినియోగం చేసుకున్న మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. కుటుంబ పోషణలో కీలకంగా మారారు. దీంతో ప్రభుత్వ సాయం తమకు ఎంతో అండగా నిలిచిందని స్వయం సహాయక సంఘాల మహిళలు చెబుతున్నారు. దీంతో తమ కుటుంబాలు హాయిగా జీవిస్తున్నాయని మహిళలు ఎంతో సంబరపడుతున్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

తహసీల్దార్ చలమయ్య



ఎన్నికల నియమావళిపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చలమయ్య

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ చలమయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఎన్నికల నియమావళిపై శనివారం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, సచివాలయాల వద్ద ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. అనుమతి లేకుండా పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించరాదని, అవసరమైతే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యంవహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 59,065 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 30,135 మంది, పురుషులు 28,929 మంది, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రమాదేవి, ఆర్‌ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బండారుకు టికెట్ ఇవ్వాలని ఆందోళన

పరవాడ: పెందుర్తి నియోజకవర్గ టికెట్‌ను మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాలకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం వెన్నలపాలెంలో బండారు నివాసానికి చేరుకొని నిరసన చేపట్టారు. స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్ద బండారుకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు సబ్బవరం నుంచి వెన్నలపాలెం వరకు నిరసన బైక్ ర్యాలీ నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలు తీర్మానించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పాలిటెక్నిక్ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న అధికారి సూర్యకళ, పాఠకులు

పెందుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం నియోజకవర్గంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పూలమాల వేసి అంజలి ఘటించారు. రాష్ట్రానికి అమరజీవి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు కె.సత్తిబాబు, ఎం.నాగమణి, బి.శేషసాయి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో

స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం అవతరణ కోసం 58 రోజుల పాటు నిరాహారదీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహానుబావుడు పొట్టి శ్రీరాములు అని ఆమె కొనియాడారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయం సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ జరిగాయి. ముందుగా శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసూక్త పారాయణం, కుంకుమ పూజలు నిర్వహించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



రావలమ్మపాలెం పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న హెచ్‌ఎం జ్యోతి తదితరులు

సబ్బవరం: మండలంలో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు మండల విద్యాశాఖాధికారి -1 లక్ష్మణరావు శనివారం తెలిపారు. మండలంలో 5 పరీక్షా కేంద్రాల్లో 921 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు చెప్పారు. వారిలో 500 మంది బాలురు, 421 మంది బాలికలు ఉన్నారన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 236 మంది, సన్‌రిడ్జ్ స్కూల్‌లో 134 మంది, ప్రతిభా విద్యాలయంలో 237 మంది, మదర్ పబ్లిక్ స్కూల్‌లో 205 మంది, రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే పరీక్షా కేంద్రంలో 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించామని ఆయన చెప్పారు.

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

పెందుర్తి: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు పెందుర్తి నుంచి మరోసారి పోటీ చేసే అవకాశం దక్కిన సందర్భంగా పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు వేపగుంట సమీపంలోని మీనాక్షి కల్యాణ మండపం వద్దకు నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వేపగుంట కూడలి నుంచి బీఆర్‌టీఎస్ రహదారి కృష్ణరాయపురం, పురుషోత్తపురం, పాపయ్యరాజుపాలెం, సుజాతనగర్, చినముషిడివాడ, పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగుతుందన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖ నుంచి, విశాఖ మీదుగా ప్రయాణించే రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. మిగిలిన రైళ్లు యథావిధిగా నడుస్తాయన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం-విశాఖ (17219) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2వ తేదీ నుంచి 29వ తేదీ తేదీ వరకు విశాఖ- మచిలీపట్నం (17220) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28వ తేదీ వరకు విశాఖ -గుంటూరు -విశాఖ (22701/22702) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

పలు రైళ్ల దారి మళ్లింపు...

ఈ క్రింది రైళ్లు ఆయా తేదీల్లో నిడదవోలు-ఏలూరు- విజయవాడ మీదుగా కాకుండా మళ్లించబడిన మార్గంలో వయా నిడదవోలు-భీమవరంటౌన్-గుడివాడ-విజయవాడ మీదుగా ప్రయాణిస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. వచ్చే నెల 1,8,15,22వ తేదీల్లో ఎర్నాకుళం-పాట్నా (22643) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 3,5,10,12,17,19,24,26వ తేదీల్లో ఎస్‌ఎంవీ బెంగళూరు-గౌహతి (12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 1,3,5,6,8,10,12, 13,15, 17,19,20,22,24,26,27వ తేదీల్లో ముంబయి -భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 28తేదీ వరకు ధన్‌బాద్- అలెప్పీ(13351) బోకారో ఎక్స్‌ప్రెస్ , 4,11,18,25వ తేదీల్లో టాటానగర్ - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్, 3,10,17,24వ తేదీల్లో జసిద్ది -తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, 1,8,15,22వ తేదీల్లో హతియా- ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్, 6,13,20,27వ తేదీల్లో హతియా- ఎస్‌ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, 2,7,9,14,16,21,23,28వ తేదీల్లో హతియా- ఎస్‌ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ , 5,12,19,26వ తేదీల్లో టాటానగర్ - ఎస్‌ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సత్యపద్మ



సత్యపద్మకు స్వాగతం పలుకుతున్న కార్యాలయ ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సత్యపద్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆమె ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఈడీ కార్యాలయం ఉద్యోగులు ఆహ్వానం పలికారు. అంతకుముందు సత్యపద్మ.. జిల్లా కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



రావలమ్మపాలెం హైస్కూల్‌లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

సబ్బవరం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ కో ఆర్డినేటర్ నర్సింగరరావు అన్నారు. మండలంలోని రావలమ్మపాలెం, అంతకాపల్లి, తవ్వవానిపాలెం, ఆదిరెడ్డిపాలెం గ్రామాల్లో బాల్య వివాహాల వల్ల అనర్థాలను ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆరోగ్యవంతమైన, విద్యావంతులైన బాలలను దేశానికి అందించినప్పుడే దేశ భవిష్యత్ సురక్షితంగా ఉంటుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను సందర్శిస్తూ ప్రజలందరికీ బాల్య వివాహాల వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తున్నట్టు చెప్పారు. 2006 బాల్య వివాహాల చట్టం ప్రకారం బాల్య వివాహం నిర్వహించిన తల్లిదండ్రులకు, అందుకు సహకరించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష ఫైన్ విధించడం జరుగుతుందన్నారు.

లోక్ అదాలత్‌లో 204 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ శిబిరంలో మాట్లాడుతున్నన్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక : గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ శిబిరంలో కక్షిదారుల మధ్య రాజీ కుదర్చడం ద్వారా న్యాయమూర్తులు 204 కేసులను పరిష్కరించారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు ప్రారంభించిన శిబిరంలో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్, యాక్సిడెంట్, బీమా తదితర రూ.11.65 కోట్ల విలువై న కేసులను పరిష్కరించినట్టు కోర్టువర్గాలు తెలిపా యి. ఐదు బెంచీల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో న్యాయమూర్తులు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, పల్లవి, వై. ప్రేమలత, బార్ అసోసియేషన్ ప్రతినిధులు వి.ఎం.కృష్ణ, సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



సింహగిరిపై ముత్తంశెట్టిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సింహగిరి వర్తకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. భీమిలి నియోజకర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసారి అవకాశం రావడంతో భీమిలి మండలం అన్నవరం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించడానికి ముందు ముత్తంశెట్టి సతీసమేతంగా వరాహ లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు.

ముత్తంశెట్టికి అభినందనల వెల్లువ

సింహగిరికి వచ్చిన ముత్తంశెట్టికి 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సింహగిరిపై ముత్తంశెట్టికి పార్టీ నాయకులు, సింహగిరి వర్తకులు సింహాద్రినాథుడి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ముత్తంశెట్టితో కలిసి అన్నవరం తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు కర్రి అప్పలస్వామి, లంక సత్తిబాబు, కర్రి సత్తిబాబు, ట్రస్ట్‌బోర్డు మెంబర్లు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, ముదుండి రాజేశ్వరి, సువ్వాడ శ్రీదేవి సింహగిరి వర్తకుల సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, వర్తకులు వరదా నరసింహమూర్తి, కస్తూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అడవివరంలో సంబరాలు



అడవివరంలో పార్టీ జెండాలతో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ 98వార్డు శ్రేణులు

సింహాచలం: భీమిలి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును ప్రకటించడంతో శనివారం రాత్రి 98వ వార్డు అడవివరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. కొండదిగువ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద ప్రధాన రహదారిపై పార్టీ జెండాలతో జై జగన్...జై ముత్తంశెట్టి అంటూ నినాదాలు చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారం చేపడుతుందని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు భారీ మెజార్టీతో గెలుస్తారని నినదించారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, దొంతల సంతోష్, వందా నరసింహమూర్తి, తెడ్లపు మహేష్, మజ్జి ధర్మా, ఆదిరెడ్డి, వర్మ, ఎస్.అప్పారావు, శిడగం తాతబాబు, ఎస్.కృష్ణ, గంట్ల కిరణ్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెషనల్ సర్కిల్ కన్వెన్షన్ ప్రారంభం



ప్రొఫెషనల్ సర్కిల్ కన్వెన్షన్ హాలును ప్రారంభిస్తున్న డైరెక్టర్ దిలీప్ కుమార్ పటేల్

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీని హెచ్‌ఆర్ డైరెక్టర్ దిలీప్ కుమార్ పటేల్ శనివారం సందర్శించారు. డైరెక్టర్ దిలీప్‌కుమార్ పటేల్‌కు సంస్థ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా హెచ్‌ఆర్ డైరెక్టర్ ఎన్టీపీసీ ప్రొఫెషనల్ సర్కిల్ కన్వెన్షన్-2024ను ప్రారంభించడంతో పాటు సింహాద్రిలో 500 మెగావాట్ల సిమ్యూలేటర్ శిక్షణ సౌకర్యాన్ని ఆవిష్కరించారు. ప్రాజెక్టు పనితీరు, సీఎస్సార్ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అసోసియేషన్, యువ ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్‌తో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్శనలో భాగంగా కంట్రోల్ రూం, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీ వాటర్ పంప్ హౌస్‌తో పాటు ప్లాంట్‌లోని వివిధ విభాగాలను డైరెక్టర్ సందర్శించారు. ఆయన వెంట జీఎం ఎస్ఎన్ పాణిగ్రహి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందడుగు



పాపయ్యరాజుపాలెం-లక్ష్మీపురం రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డును అభివృద్ధి పథంలో నడిపేందుకు తనవంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని రూ.1.58 కోట్లతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను శనివారం దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాపయ్యరాజుపాలెంలో డ్రైనేజీని, భవానీనగర్ బాక్స్ కల్వర్ట్‌ను, సాయిసాధనగర్ నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంక్ వరకు నిర్మించిన డ్రైనేజీ కాలువలను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయిత ఎర్రయ్య, కంచి బోయిన సంతోష్, పులమరశెట్టి లక్ష్మణ్, పీడీవీ ప్రసాద్, దువ్వి అప్పారావు, లక్ష్మి, సూర్యకుమారి, రామునాయుడు, చిన్నంనాయుడు, సంగమేశ్వరరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాదకద్రవ్యాల నిరోధంపై ప్రసంగిస్తున్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిశోర్ కుమార్

కూర్మన్నపాలెం: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు సర్వనాశనం అవుతాయని విశాఖ సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మాదకద్రవ్యాల నిరోధంపై సింహాద్రి టీఎంటీ ఆధ్వర్యంలో గ్రీన్‌సిటీ వైజాగ్ ప్రొఫైల్ ఆఫీస్ నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి కుటుంబ విలువలు పెరిగేలా ప్రవర్తించాలని సూచించారు. సింహాద్రి టీఎంటీ అధినేత బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా మాదవద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారన్నారు. కోస్టల్ ఆంధ్ర బీసీ వెల్ఫేర్ అధ్యక్షుడు నరవ రాంబాబు, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఎస్. శ్రీనివాస్, హెచ్.నర్స్ కె.మణి, పూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.